సాక్షి
నల్లగొండ

ఆదివారం । 4 । ఆగస్టు । 2024



జలసవ్వడులకు 57 ఏళ్లు

నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాల్వలకు మొదటిసారి నీటిని విడుదల చేసి ఆదివారంతో 57 ఏళ్లు నిండాయి.

- 8లో



మోసగాళ్ల ముఠా అరెస్ట్

పెట్రోల్ బంకుల్లో స్వైపింగ్ మిషన్ల ద్వారా డబ్బులు కొట్టేస్తున్న మోసగాళ్ల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు.

- 8లో



పెట్రోల్ బంకులో చోరీ

చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో గల హెచ్‌పీ పెట్రోల్ బంకులో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది.

- 8లో

న్యూస్‌రీల్

'ఇన్నోవేటర్-24'కు దరఖాస్తు గడువు పెంపు

నల్లగొండ: ఇంటింటా ఇన్నోవేటర్-2024 కార్యక్రమం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 3 నుంచి 10వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు కలెక్టర్ నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది 6వ ఎడిషన్‌తో ముందుకొచ్చిన ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం గ్రామీణ తెలంగాణలో కొత్త ఆవిష్కరణలు, వ్యవస్థాపకతను పెంపొందించడమే లక్ష్యంగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పేర్కొన్నారు. కొత్త ఆవిష్కరణలను ఆగస్టు 15న ప్రదర్శిస్తామని తెలిపారు. వినూత్న ఆవిష్కరణలకు అవార్డులు అందజేస్తామని పేర్కొన్నారు.

మహిళలకు భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

నల్లగొండ టౌన్: మాదక ద్రవ్యాలను నిషేధించి మహిళలకు భద్రత కల్పించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయాలని, మారుమూల గ్రామాలకు బస్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో కొండ అనురాధ, జిట్ట సరోజ, తుమ్మల పద్మ, నాగమణి, ఇందిర, ఉమారాణి, పాలడుగు ప్రభావతి పాల్గొన్నారు.

పంట చేలకు చేరువగా సాగర్ బ్యాక్ వాటర్



పాల్తీతండా సమీపంలో సాగుచేసిన పత్తిచేను వద్దకు చేరిన సాగర్ బ్యాక్ వాటర్

పెద్దవూర: కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుండడంతో నాగార్జునసాగర్ జలాశయానికి వరద పోటెత్తుతోంది. దీంతో బ్యాక్ వాటర్ పెరుగుతోంది. అయితే కృష్ణ పట్టె గ్రామాలైన పాల్తీతండా, నంభాపురం, పూల్యాతండా, మల్లెవానికుంటతండా, ఊట్లపల్లి, గేమ్యానాయక్ తండాల పరిధిలోని కృష్ణానదిలో బ్యాక్ వాటర్ లేకపోవడం.. భూములు తేలి ఉండడంతో ఆ భూముల్లో రైతులు వానాకాలం సీజన్ ప్రారంభంలో పత్తి పంటను సాగు చేశారు. పంట ఏపుగా పెరిగింది. ప్రస్తుతం జలాశయానికి వరద ఉధృతి పెరిగి పంట చేలను తాకింది. రెండు రోజులైతే పంట చేలు పూర్తిగా మునిగిపోనున్నాయి. దీంతో రూ.లక్షల పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు మునిగిపోతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు.

సర్వేయర్లు బదిలీ

నల్లగొండ: జిల్లాలో ల్యాండ్ సర్వే సెటిల్‌మెంట్ రికార్డుల శాఖలో పనిచేస్తున్న కొందరు సర్వేయర్లను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. జిల్లా నుంచి 10 మంది సూర్యాపేట, యాదాద్రి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయా జిల్లాల నుంచి నల్లగొండకు ఎనిమిది మంది బదిలీపై వచ్చారు. జిల్లాలో ముగ్గురు డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్లకు ఇద్దరు ఉండగా వారు కూడా బదిలీపై వెళ్లడంతో ప్రస్తుతం జిల్లాలో మూడు డీఐ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

నృసింహుడికి ఆరాధనలు



స్వామి,అమ్మవారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీల క్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శనివారం ఆధ్యాత్మికపర్వాలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వయంభూలకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.

స్నే'హితులు'

బుడి బుడి అడుగుల బాల్యంలో పరిచయమైన మరొక బంధం.. బడిలో బలపం పంచుకున్నప్పుడు ఏర్పడిన సంబంధం.. అక్షరాలు నేర్చుకునేటప్పుడు ఆసరాగా నిలిచిన అనుబంధం.. ఆటలు ఆడుతున్నప్పుడు అల్లుకున్న ఆత్మీయ అనుబంధం.. కష్టనష్టాల్లోనూ నేనున్నా అంటూ ఆసరాగా నిలిచేదే స్నేహ బంధం.



నేడు స్నేహితుల దినోత్సవం

ప్రత్యేక కథనాలు 8లో



నాగార్జున సాగర్‌లో పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లో పర్యాటకుల సందడి నెలకొన్నది. జలాశయానికి వరద వస్తుండడంతో జలకళను చూసేందుకు పర్యాటకులు తరలి వస్తున్నారు. కృష్ణాతీరం వెంట విద్యుదుత్పాదనతో దిగువకు వెళుతున్న నీటిని, ఎర్తుడ్యాం దరికి చేరుకున్న జలాలు, బుద్ధవనం తదితర ప్రాంతాలను సందర్శిస్తున్నారు.

ఉల్లంఘనలు ఏల?

- వివిధ శాఖల్లో తప్పిదాలను బయటపెట్టిన ఆడిట్ విభాగం
- చెర్వుగట్టు కొబ్బరికాయల వేలం ఎందుకు వదిలేశారు
- రావాల్సిన మొత్తం వసూలు చేయలేదెందుకు
- రికవరీకి వెంటనే చర్యలు చేపట్టండి
- మున్సిపాలిటీల్లో అవకతవకలపైనా ఆక్షేపణ
- పలు అంశాలను ఎత్తిచూపిన 2021-22 ఆడిట్ నివేదిక



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలో వివిధ శాఖల్లో జరిగిన ఉల్లంఘనలు, అలసత్వం, కాంట్రాక్టర్లతో కుమ్మక్కు వంటి అంశాలను రాష్ట్ర ఆడిట్ శాఖ ఎత్తి చూపింది. వివిధ శాఖల్లో జరిగిన తప్పిందాలను ఎండగట్టింది. అయాచిత లబ్ధి చేకూర్చేలా చేపట్టిన చర్యలను బయట పెట్టింది. వెంటనే ఆ తప్పిదాలను సరిదిద్దాలని, శాఖలకు రావాల్సిన బకాయిలను వసూలు చేయాలని స్పష్టం చేసింది. 2020-21 సంవత్సరం పంచాయతీరాజ్ సంస్థలు, మున్సిపాలిటీలు, వ్యవసాయ మార్కెట్ల ఖాతాలను పరిశీలించి జరిగిన తప్పిదాలను ఆడిట్ శాఖ తమ నివేదికలో ఎత్తి చూపింది. వివిధ శాఖలపై రూపొందించిన ఆడిట్ నివేదికలను ఇటీవల విడుదల చేసింది. అందులో జిల్లాకు సంబంధించిన పలు అంశాలను వివరించింది.

వేలం మొత్తాన్ని వసూలు చేయలేదెందుకు?

నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు ఆలయం కొబ్బరి కాయల వేలం ఫైళ్లను పరిశీలించగా.. 2020, 2021 సంవత్సరాలకు సంబంధించి రూ.4.70 లక్షలు వసూలే చేయలేదని తేలింది. 2020 జనవరి 1వ తేదీ నుంచి 2021 డిసెంబర్ 31వ తేదీ వరకు కొబ్బరికాయల వేలాన్ని పి.శంకర్ రూ.33.20 లక్షలకు దక్కించుకున్నారు. అందులో రూ.28.50 లక్షలు మాత్రమే చెల్లించారు. వేలం సమయంలోనే మిగతా మొత్తాన్ని చెల్లించాల్సి ఉన్నా చెల్లించలేదు. ఆ మొత్తాన్ని పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 273 ప్రకారం గ్రామ పంచాయతీకి జమచేయాలి. ఆ బకాయిలను వసూలు చేయడానికి వెంటనే చర్యలు చేపట్టాలని పేర్కొంది.

వసూలు చేయని గోదాముల అద్దె

చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆడిట్ నివేదిక ప్రకారం ఏప్రిల్ 2021 నాటికి రావాల్సి ఉన్న రూ.25,54,801లను వసూలు చేయలేదని ఆడిట్ విభాగం తేల్చింది. మూడు గోదాముల నుంచి ఈ అద్దెను వసూలు చేయాల్సి ఉన్నా చేయలేదని పేర్కొంది. వెంటనే సదరు ఏజెన్సీల నుంచి బకాయిలను వసూలు చేసి మార్కెట్ కమిటీ నిధులకు జమ చేయాలని వెల్లడించింది. ఆ మూడు గోదాముల అద్దె సివిల్ సప్లై కార్పొరేషన్ నుంచి రావాల్సి ఉండటం గమనార్హం.

పశువుల సంతలోనూ అదే పరిస్థితి

నార్కట్‌పల్లి గ్రామ పంచాయతీ లెక్కల ఆడిట్ సమయంలో ఆదాయ వ్యయాలను, ఫైళ్లను పరిశీలించగా పశువుల సంతను వేలంలో రూ.26,01,000 పాటపాడి సంతను దక్కించుకున్న జి.రమేష్ రూ.23,84,250 మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.2,16,750 చెల్లించాల్సి ఉంది. వేలం నిబంధనల ప్రకారం వేలం జమ సమయంలోనే వేలం పాట మొత్తాన్ని చెల్లించాల్సి ఉన్నా రూ.2,16,750 చెల్లించలేదు. ఆ మొత్తాన్ని గ్రామ పంచాయతీకి జమ చేయాల్సి ఉందని పేర్కొంది.

సీనరేజీ చార్జీల రికవరీ ఏదీ?

చండూరు మున్సిపాలిటీలో కంకర సరఫరాకు సంబంధించిన ఎనిమిది పనుల్లో కాంట్రాక్టరుకు నిర్దేశించిన రేట్ల ప్రకారం ఇచ్చే బిల్లు నుంచి సీనరేజీ చార్జీలు రికవరీ చేయాల్సి ఉన్నా చేయలేదు. దీంతో కాంట్రాక్టరుకు అదనంగా రూ.1,38,040 చెల్లించినట్లైంది. ఆ మొత్తాన్ని రికవరీ చేసి సంబంధిత శాఖకు జమ చేయాలి. ఈ విషయాన్ని చండూరు మున్సిపాలిటీ కౌన్సిల్ ఆడిట్ నివేదికలో గుర్తించింది.


ఉదయ సముద్రానికి వెయ్యి క్యూసెక్కులు

పెద్దఅడిశర్లపల్లి: నల్లగొండ జిల్లా కేంద్రం తాగునీటి అవసరాలు, జిల్లా సాగునీటి అవసరాలు తీర్చేందుకు ఏఎమ్మార్పీ ప్రధాన కాలువ ద్వారా ఉదయ సముద్రానికి నీటి విడుదల కొనసాగుతుంది. గతనెల 22న తాగునీటి అవసరాల నిమిత్తం 500 క్యూసెక్కులు విడుదల చేసిన అధికారులు, సాగర్ నీటిమట్టం పెరగడంతో శనివారం మరో 500 పెంచి 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ వెనుకజలాల నుంచి ఏఎమ్మార్పీ 3 మోటార్ల ద్వారా 1,800 క్యూసెక్కుల నీటిని ఏకేబీఆర్‌కు పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అక్కడి నుంచి హైదరాబాద్ జంట నగరాలకు 525 క్యూసెక్కులు, ఉదయ సముద్రానికి 1,000 క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 45 క్యూసెక్కులు, డీ-7కు 100 క్యూసెక్కులు, డీ-8, 9కు 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

టెయిల్ పాండ్ దిగువకు..

అడవిదేవులపల్లి: సాగర్‌జలాశయం నుంచి టెయిల్ పాండ్‌కు శనివారం 27.418 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. ఈక్రమంలో టెయిల్‌పాండ్ నాలుగు గేట్లు మీటర్‌మేర పైకెత్తి దిగువకు 25,332 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రేపు సాగర్ గేట్లు ఓపెన్!



నీటితో కళకళలాడుతున్న సాగర్ జలాశయం

- ఎగువ నుంచి పెరిగిన వరద ఉధృతి
- రోజుకు 30 టీఎంసీల నీరు రాక

నాగార్జునసాగర్: శ్రీశైలం జలాశయం నుంచి వరద ఉధృతి పెరగడంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం గంటగంటకు పెరుగుతోంది. గరిష్ట నీటిమట్టానికి చేరువ అవుతుండడంతో సోమవారం సాయంత్రం సాగర్ ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తే అవకాశముంది. శ్రీశైలం నుంచి 10 గేట్లు 20 అడుగులు ఎత్తి స్పిల్‌వే మీదుగా 4,61,560 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతోపాటు కుడి, ఎడమ విద్యుదుత్పాదక కేంద్రాల ద్వారా 62,668 క్యూసెక్కులు కలిపి మొత్తంగా 5,24,228 క్యూసెక్కుల వరద నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం శనివారం రాత్రి 9గంటలకు 567 అడుగులకు చేరింది. ప్రాజెక్టులో 245 టీఎంసీల నీరు ఉంది. పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. నీటి నిల్వ సామర్థ్యం 312.5050 టీఎంసీలు. ఎగువ నుంచి వరద భారీగా వస్తున్నందున సాగర్ ప్రాజెక్టులో నీరు 300 టీఎంసీలకు చేరుకోగానే క్రస్ట్‌గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉంది.

గత నాలుగేళ్లలో ఆగస్టులోనే గేట్లు ఓపెన్

సాగర్ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లు గత నాలుగేళ్లలో ఆగస్టు నెలలోనే తెరుచుకున్నాయి. 2019లో ఆగస్టు 12న, 2020లో ఆగస్టు 21న, 2021లో ఆగస్టు 1న, 2022లో ఆగస్టు 11న సాగర్ రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. 2023లో వర్షాలు సరిగా కురవకపోవడంతో జలాశయానికి నీరు చేరలేదు. ఇప్పుడు కూడా ఆగస్టు మొదటి వారంలోనే గేట్లు ఎత్తనున్నారు.

సాగర్ నుంచి అవుట్ ఫ్లో ఇలా..

నాగార్జునసాగర్ జలాశయం నుంచి కుడి కాల్వకు 6,660 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 3,374 క్యూసెక్కులు, ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా 27,507 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. అదేవిధంగా ఏఎమ్మార్పీకి 1800 క్యూసెక్కులు, వరదకాల్వకు 400క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

26 నెలల్లో సొరంగం పూర్తి



గుండ్లపల్లిలో డీ-37 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి తదితరులు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- గుండ్లపల్లి వద్ద డీ-37 కాల్వకు నీటి విడుదల

నల్లగొండ రూరల్: వచ్చే 26 నెలల్లో ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పూర్తిచేస్తానని.. దీంతో నా కల సాకారం అవుతుందని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ మండలం గుండ్లపల్లి వద్ద డీ-37 కాల్వకు ఆయన అధికారులతో కలిసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడారు. వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు డీ-37 కాల్వను తవ్వించి ఆయనతో కలిసి కాల్వకు నీటి విడుదల చేసానని.. మళ్లీ ఇప్పుడు తాను మంత్రిగా నీటిని విడుదల చేస్తున్నట్లు గుర్తు చేశారు. బి.వెల్లెంల ప్రాజెక్టును కూడా పూర్తిచేసి ఆ నీటితో రైతుల పాదాలు కడుగుతానన్నారు. కార్యక్రమంలో మున్సి˘ఎల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఆర్డీఓ రవి, కనగల్ మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస గౌడ్, నాయకులు పనస శంకర్‌గౌడ్, రేగట్టె లింగస్వామి, భాస్కర్, సైదులు యాదవ్, సత్యనారాయణ, సతీష్‌రెడ్డి, బిక్షం, రాజు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

కనగల్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం కనగల్ మండలం రేగట్టెలో గ్రామంలో రూ.3కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/ 11 కేవీ సబ్ స్టేషన్ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కనగల్ క్రాస్‌రోడ్డును రూ.10కోట్ల వ్యయంతో సుందరంగా తీర్చిదిద్దుతన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అనూప్, శ్రీనివాస్, వెంకటేశం, జగాల్, నర్సిరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు అదనంగా ఎరువులు

రామగిరి(నల్లగొండ): సాగర్ నీటి విడుదల నేపథ్యంలో ఈ సీజన్‌లో జిల్లాకు అదనంగా 4,400 మెట్రిక్ టన్నుల ఎరువులను కేటాయిస్తామని వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు హామీ ఇచ్చారని డీఏఓ శ్రవణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచన మేరకు నెల వారి కోటా కంటే అదనంగా కేటాయించారని పేర్కొన్నారు. ఆ ఎరువులు వారం రోజుల్లో జిల్లాకు రానున్నాయని ఆయన పేర్కొన్నారు.

వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు బదిలీ

నల్లగొండ టౌన్: ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్‌లు శనివారం బదిలీ అయ్యారు. వీరిలో జీజే.పాల్, బి.రవికుమార్, జె.రాంరెడ్డి, సీహెచ్.మహిపాల్ రెడ్డి, అమరేందర్‌జెల్లా, టి.అశోక్‌కుమార్, ఆర్.స్వాతి, జ్ఞానేశ్వర్, ఎం.సందీప్‌కుమార్, ఎస్.నాగార్జునరెడ్డి, కె.అజ్మీరా, ఎస్.శశికళ, ఎ.భరత్‌రెడ్డి, కె.సందీప్‌రెడ్డి, కె.రవి, ఎం.మేగ్యానాయక్, కె.మహేందర్‌రెడ్డి, పి.చంద్రబాబు, ఎ.శ్రీకాంత్‌రెడ్డి, ఎం.విక్రమ్‌రెడ్డి, అభినవ్, ప్రసన, పి.సురేందర్, భార్గవ్‌సంతోష్, టి.సంకేత్, ఎ.శ్రవణ్, మౌనికరెడ్డి, సుధాకర్‌నాయక్, నాగేంద్ర, బి.శ్రీజ ఉన్నారు.

సాగర్ నీటిని సాగుకు మళ్లించొద్దు

- కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ: నాగార్జునసాగర్ నీటితో జిల్లాలోని అన్ని చెరువులను నింపుతున్నందున ఆ నీటిని రైతులెవరూ సాగుకు మళ్లించుకోవద్దని కలెక్టర్ సి.నారాయణరెడ్డి కోరారు. శనివారం ఆయన నాగార్జునసాగర్ నీటి వినియోగంపై అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. చెరువులు, కుంటల కట్టలు తెగేందుకు, గండ్లు పడేందుకు ఆస్కారం ఉంటే వాటిని గుర్తించి తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ సాగర్ నీటిని వృథాచేయకుండా పోలీస్ శాఖ తరఫున అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని, బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నాగేశ్వర రావు, అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, ఆర్డీఓలు, సాగర్ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగంగా పూర్తిచేయాలి

నాన్ లేఅవుట్ భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న లేఅవుట్ ఎల్ఆర్ఎస్ ప్రక్రియను 2025 నాటికి వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శనివారం మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు హైదరాబాద్ నుంచి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

నేనొచ్చేలోగా కూల్చేయండి

- అనుమతి లేకుండా నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ భవనం ఉండొద్దు
- మున్సిపల్ అధికారులకు మంత్రి ఆదేశం

నల్లగొండ టూటౌన్: అనుమతి లేకుండా నల్లగొండలో నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ భవనం ఉండొద్దు.. తాను అమెరికా పర్యటనకు వెళ్లి ఈనెల 11న వస్తానని.. నేనొచ్చేలోగా దాన్ని కూల్చేయండి అని రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. శనివారం నల్లగొండ మున్సిపాలిటీ కార్యాలయం వద్ద కౌన్సిల్ హాల్, రికార్డు రూం నిర్మాణాలకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలకు పాటించే నిబంధనలే అన్ని భవనాలకు వర్తింపజేసి తొలగించాలని అదనపు కలెక్టర్, మున్సిపల్ అధికారులకు హుకుం జారీ చేశారు. కరీంనగర్ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన 30 భవనాలను అక్కడి మున్సిపల్ అధికారులు కూల్చివేశారని, అవే నిబంధనలు ఇక్కడ కూడా వర్తిస్తాయని అధికారులకు చెప్పారు. భవనాన్ని కూల్చేందుకు సంబంధిత పార్టీ బాధ్యులకు నోటీసులు జారీ చేయాలన్నారు. భవనం కూల్చేయకుంటే మీమీద చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ప్రజారోగ్య శాఖ ఎస్ఈ కందుకూరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మున్సిపల్ ఈఈ రాములు, ఈఈ సత్యనారాయణ, కౌన్సిలర్లు, నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మున్సిపల్ కౌన్సిల్ హాల్ నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి

విద్యుత్ లోవోల్టేజీకి చెక్..!

- 10 సబ్ స్టేషన్ల నిర్మాణానికి సన్నాహాలు
- పూర్తయిన భూసేకరణ ప్రక్రియ విద్యుత్ శాఖకు అప్పగింత
- ఇప్పటికే కనగల్ మండలం రేగట్టెలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన



కనగల్ మండలం రేగట్టెలో శనివారం సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ : విద్యుత్ లోవోల్టేజీని నివారించేందుకు జిల్లాలో కొత్తగా పది 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఒక్కో సబ్‌స్టేషన్‌ను ఎకరం స్థలంలో సుమారు మూడున్నర కోట్ల రూపాయలతో నిర్మించనున్నారు. ఇప్పటికే ఎకరం చొప్పున భూ సేకరణ పూర్తి చేసిన అధికారులు విద్యుత్ శాఖకు అప్పగించారు. రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం కనగల్ మండలం రేగట్టె గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆదివారం ఇదే మండలంలోని చిన్నమాధారంలో శంకుస్థాపన చేయనున్నారు. అందుకు సంబంధించి విద్యుత్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

విద్యుత్ వినియోగం పెరగడంతో..

గడిచిన మూడు, నాలుగేళ్లగా జిల్లాలో సబ్‌స్టేషన్లు మంజూరు కాలేదు. మరోవైపు విద్యుత్ కనెక్షన్లు భారీగా పెరగడంతో వినియోగం కూడా పెరిగి లోవోల్టేజీ సమస్య ఉత్పన్నమవుతోంది. దాన్ని అధిగమించేందుకు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం నల్లగొండ జిల్లాకు 10 సబ్ స్టేషన్లను మంజూరు చేసింది. ఇందుకు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఎంతోగానో కృషి చేశారు.

కలెక్టర్ నుంచి అనుమతి

జిల్లాలో పది 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూసేకరణ చేయాలని విద్యుత్ శాఖ ఆదేశాలతో ఎకరం చొప్పున భూసేకరణ చేశారు. ఎలాంటి సమస్యలు లేని భూములను గుర్తించి వాటిని కలెక్టర్ అనుమతికి పంపారు. కలెక్టర్ నారాయణరెడ్డి వాటిని పరిశీలించి ఆయా స్థలాల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అనుమతిచ్చారు. రెవెన్యూ అధికారులు భూములను విద్యుత్‌శాఖకు అప్పగించారు.

లోవోల్టేజీ సమస్య తీరుతుంది

జిల్లాలో విద్యుత్ వినియోగం పెరిగింది. లోవోల్టేజీ సమస్య ఏర్పడుతోంది. దాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం జిల్లాకు పది 33/11 కేవీ సబ్‌స్టేషన్లను మంజూరు చేసింది. భూమిని గుర్తించి అప్పగించారు. టెండర్లు పూర్తయితే పనులు ప్రారంభమవుతాయి. కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం వల్ల జిల్లాలో లోవోల్టేజీ సమస్య పూర్తిగా పరిష్కారమవుతుంది.

– చంద్రమోహన్, విద్యుత్ శాఖ ఎస్ఈ

సబ్‌స్టేషన్లు నిర్మించే ప్రాంతాలు ఇవే..

కనగల్ మండలం చిన్నమాదారం, రేగట్టె, మునుగోడు మండలం మునుగోడు, తిప్పర్తి మండలం గడ్డికొండారం, మిర్యాలగూడ మండలం రాయినిపాలెం, తుంగపాడ్, చింతపల్లి, దామరచర్ల మండలంలోని వాత్యాతండా, మాడ్గులపల్లి మండలంలోని తోపుచర్ల, తిరుమలగిరిసాగర్ మండలంలో చింతలపాలెంలో సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు.

స్నేహంలోనే మాధుర్యం



- ఏ స్థాయికి ఎదిగినా.. ఆప్తమిత్రులు ఉండాలి
- నల్లగొండ కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నల్లగొండ : స్నేహంలో ఎంతో మాధుర్యం ఉంటుంది. అమ్మనాన్నల బంధం, భార్యాభర్తల సంబంధం, అన్నదమ్ముల అనుబంధాల కంటే స్నేహితుల బంధం ఎంతో ముఖ్యమైనది అంటున్నారు నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆయన 'సాక్షి'తో తన అనుభవాలను పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే.. మాది నారాయణపేట్ జిల్లా, నర్వ మండలం, శ్రీపురం గ్రామం. అక్కడే ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేశా. ఇంటర్మీడియట్ కూడా అక్కడే పూర్తి చేశా. ఉన్నత చదువులు హైదరాబాద్‌లో చదివా. పాఠశాల, ఇంటర్, డిగ్రీ, పీజీ వరకు నాకు చాలా మంది స్నేహితులున్నారు. వారంతా ఇప్పుడు వివిధ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఎవరు ఏ స్థాయిలో ఉన్నా.. స్నేహితులుగా అందరం ఒకరినొకరు గౌరవించుకుంటాం. నెలకు లేదా మూడు నెలలకోసారి తప్పకుండా మా ఫ్రెండ్స్ అంతా కలుస్తాం. వాళ్ల కలిసినప్పుడు అన్నీ మరిచిపోయి ఆనాటి జ్ఞాపకాలు నెమరవేసుకుంటు హాయిగా గడుపుతాం. ఇలా స్నేహంలోని మాధుర్యాన్ని పొందుతాం. స్నేహ బంధం ఎంతో గొప్పది. కాబట్టి నిజమైన స్నేహితులను వదులుకోవద్దు. మంచి స్నేహితులతో దీర్ఘ కాలం స్నేహ బంధం కొనసాగడం మంచిది.

స్నే'హితులు'

ఒకరికొకరు అండగా బాల్యమిత్రులు



చిన్ననాటి నుంచి కలిసి తిరిగిన.. చదువుకున్న వ్యక్తుల మధ్య ఉండే అనుబంధం మాటలకు చెప్పలేనిది. మనకు కష్టం వచ్చినా, బాధ కలిగినా స్నేహితుల తోడు ఉంటే ఏదైనా అధిగమించవచ్చు. ప్రస్తుతం కాలంలో ఆనాటి స్నేహితులు, పూర్వ విద్యార్థులు ఉపాధి వేటలో వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్నా.. ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని వారి కష్ట సుఖాలను పంచుకుంటున్నారు. ఏ స్నేహితుడికైనా ఆపదొస్తే మేమున్నామంటూ అండగా నిలుస్తూ.. స్నేహాన్ని చాటుతున్నారు.

తోడుగా మేమున్నాం



ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు (ఫైల్)

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు. గతంలో తమ క్లాస్‌మేట్ అనారోగ్యంతో మృతిచెందగా స్పందించి ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. తమ క్లాస్‌మేట్ భర్త పక్షవాతానికి గురికావడంతో కుటుంబం గడవడం కష్టం కావడంతో రూ.70 వేలు అందించిచ ఆమె భర్తకు ఫిజియోథెరపి, ఆటో సౌకర్యం కల్పించారు. ఇటీవల మరో స్నేహితుడి తల్లి మృతిచెందగా అతడి కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సాయం అందించి ఆపదలో తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వైకల్యాన్ని ఓడించారు

తిప్పర్తి : స్నేహం కాన్న గొప్పది ఏదీ లేదని నిరూపించారు తిప్పర్తి మండలం యర్రగడ్డలగూడెం గ్రామానికి చెందిన తాటికొండ నాగిరెడ్డి స్నేహితులు. పుట్టుకతోనే దివ్యాంగుడైన నాగిరెడ్డి ఎంఏ బీఈడీ వరకు చదువుకున్నాడు. దివ్యాంగురాలైన పద్మ వివాహం చేసుకున్నాడు. నల్లగొండలో చిన్న గది అద్దెకు తీసుకొని ప్రభుత్వం ఇస్తున్న పింఛన్‌పై ఆధారపడి జీవనం సాగిస్తూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. నాగిరెడ్డి ఇబ్బందులను గమనించిన అతడి స్నేహితులు నాగిరెడ్డి కుటుంబానికి రూ.3.50 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఇవే కాకుండా నెలనెలా ఎవరికి తోచినంత వారు సాయం అందజేస్తూనే ఉన్నారు.



నాటి కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ చేతులమీదుగా ద్విచక్ర వాహనం అందజేస్తున్న మిత్రులు(ఫైల్)

వీటితోపాటు నాగిరెడ్డి మిత్రుడు కరుణాకర్‌రెడ్డి ఇతర దాతల సహకారంతో రూ.లక్ష విలువగల ద్విచక్రవాహనాన్ని సమకూర్చి అండగా నిలిచారు.

సహ విద్యార్థులకు తోడుగా..



స్నేహితుడి కుటుంబానికి సాయం అందజేస్తున్న స్నేహితులు (ఫైల్)

అర్వపల్లి : అర్వపల్లిలో విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ 2000–2001 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తమ తోటి స్నేహితులకు ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా మేమున్నామంటూ అండగా నిలుస్తున్నారు. వారి సహ విద్యార్థిని ఝాన్సీ భర్త మరణించగా ఆమెకు రూ.40 వేలు ఆర్థికసాయం అందించారు. పర్సాయపల్లి మాజీ సర్పంచ్ పుష్పాల శేఖర్ అనారోగ్యానికి గురికాగా వైద్యం కోసం రూ.50 వేలు అందజేశారు. తోటి మిత్రుడు జానయ్య, అతని కూతురు ఇద్దరూ ప్రమాదంలో మరణించడంతో వారి కుటుంబానికి రూ.80 వేలు అందించారు. కిరణ్ అకాల మరణం చెందగా ఆయన కుటుంబానికి రూ.50 వేలు సాయం చేశారు. తమకు చదువు చెప్పిన గురువు మల్లికార్జున్ అనారోగ్యంతో మృతిచెందగా ఆ కుటుంబానికి రూ.50 వేలు ఆర్థికసాయం చేశారు. ఇలా ఈ బ్యాచ్ విద్యార్థులు 23 ఏళ్ల నుంచి తోటి వారికి ఆసరాగా ఉంటున్నారు.

స్నేహితులే ఇల్లు కట్టించారు

మోత్కూరు : తోటి స్నేహితుడు ఆకస్మికంగా మరణించడంతో గూడు లేని అతని కుటుంబానికి స్నేహితులంతా కలిసి ఇల్లు కట్టించారు. మోత్కూరుకు చెందిన నల్లమాస లింగయ్య, ఆయన భార్య పద్మ, కుమారుడు అఖిల్ ఉన్నారు. లింగయ్య తన స్నేహితుడు గుండగోని రామచంద్రయ్య వద్ద సుమారు 20 ఏళ్ల గుమస్తాగా పనిచేశాడు. దీంతో వారి మధ్య స్నేహ బంధం ఏర్పడింది. కరోనా సమయంలో లింగయ్యను మృత్యువు కబలించింది. లింగయ్య ఆకస్మికంగా మరణించారు. దీంతో లింగయ్య స్నేహితుడు గుండగోని రామచంద్రు, కోమటి మత్స్యగిరి, బయ్యని రాజు, గాదె వెంకటేశ్వర్లు, సూదగాని కిష్టయ్య, బుర్ర సంతు, బుర్ర యాదయ్యతో పాటు మరికొందరు కలిసి సుమారు రూ.2 లక్షల విరాళాలతో లింగయ్యకు ఉన్న ఖాళీ స్థలంలో ఇంటిని నిర్మాణం చేయించారు. స్నేహితుడు మరణించినా గూడు లేని ఆ కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వడాన్ని పలువురు వారిని అభినందిస్తున్నారు.



స్నేహితులు కట్టించిన ఇల్లు

స్నేహితురాలికి సాయం..

ఆత్మకూరు(ఎం) : ఆత్మకూరు(ఎం) మండలంలోని రహీంఖాన్‌పేటలో స్నేహితురాలి కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. భర్త మృతితో బతుకు ఆగమవుతుందనుకున్న తరుణంలో వారంతా కలిసి ఆమెకు భరోసా కల్పించారు. గ్రామానికి చెందిన గజం ఉమారాణి భర్త దయ్యాల రాజు అనారోగ్య కారణాలచే ఇటీవల మృతి చెందాడు. చిన్న వయస్సులోనే భర్తను పోగొట్టుకుని దిక్కుతోచని స్థితిలో ఉన్న ఉమారాణికి పదో తరగతి 2007 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. అంతా కలిసి రూ.30 వేలు ఉమారాణికి అందజేశారు. అంతే కాకుండా ఏ ఆపద ఉన్నా మా దృష్టికి తీసుకొస్తే తోచిన సాయం అందజేస్తామని భరోసా ఇచ్చారు.



సాయం అందజేస్తున్న స్నేహితులు (ఫైల్)

మిత్రుల ఔదార్యం

రామన్నపేట : ఆపదలోఉన్న బాల్యమిత్రుల కుటుంబాలకు అండగా నిలుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. రామన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1989–90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు. 2020 జూలై 19న డయాలసిస్ సమస్యతో బాధపడుతున్న స్నేహితుడు పెండెం మార్కండేయకు రూ.60 వేలు, 2021నవంబర్ 28న అనారోగ్యంతో మరణించిన గాదె సంజీవ కుటుంబానికి రూ.30 వేలు, 2023 ఆగస్టు 27న అనారోగ్యంతో చనిపోయిన సాల్వేరు రాజేశ్వర్ కుటుంబానికి రూ.58 వేలు, 2023 ఏప్రిల్ 9న అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నపాక వెంకటేశ్వర్లు కుటుంబానికి రూ.55 వేలు ఆర్థిక సాయమందించి అండగా నిలిచారు.



స్నేహితుడి కుటుంబానికి సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు (ఫైల్)

బాల్య మిత్రుల భరోసా

వలిగొండ : వలిగొండలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000-2001 పదో తరగతి పూర్వ విద్యార్థులలో జక్రోజు మంజుల భర్త నాగరాజు ఇటీవల అనారోగ్యంతో తోటి విద్యార్థులు ఆమెకు రూ.55 వేల ఆర్థికసాయం అందజేశారు. గతంలో వారితో చదువుకున్న మిత్రుడు నాగేష్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి రూ.38 వేలు అందజేశారు. తోటి స్నేహితులు ఆపదలో ఉంటే వారికి అండగా నిలుస్తామని చెబుతున్నారు పూర్వ విద్యార్థులు.



మిత్రురాలికి సాయం అందజేస్తున్న మిత్రులు (ఫైల్)

ఆపదలో అండగా..



రూ.50 వేలు అందజేస్తున్న మిత్రులు (ఫైల్)


చౌటుప్పల్ : చౌటుప్పల్ జెడ్పీహెచ్ఎస్ 1992–93 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ మిత్రులకు ఎలాంటి ఆపద ఉన్నా వెంటనే స్పందించి తమవంతుగా చేయూతనిస్తున్నారు. చిన్నకొండూర్ గ్రామానికి చెందిన మిత్రుడు తీగుళ్ల కృష్ణయ్య 2021లో కరోనాతో చనిపోయాడు. స్నేహితులంతా కలిసి కృష్ణయ్య కుమార్తె పేరిట రూ.1.20 లక్షలు పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామానికి చెందిన డాకోజి రామకృష్ణ 2022లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతని కుటుంబానికి రూ.62 వేల ఆర్థికసాయం అందించారు. చౌటుప్పల్‌కు చెందిన ఎండీ.చాంద్‌పాషా ఈ ఏడాది ఏప్రిల్ నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. అప్పటికే తీవ్ర అనారోగ్యానికి గురైన అతని భార్య వైద్య ఖర్చులకు రూ.50 వేల సాయం అందజేశారు.

జలసవ్వడులు మొదలై.. 57 ఏళ్లు

- సాగర్ ఎడమ, కుడి కాల్వలకు నీటిని విడుదల చేసిన ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ



మొదటిసారి నీటిని విడుదల చేసిన అనంతరం కాల్వను పరిశీలిస్తున్న ఇందిరాగాంధీ (ఫైల్)



మొదటిసారి ఎడమ కాల్వకు నీరు విడుదలైనప్పుడు..



ప్రస్తుతం ఎడమ కాల్వకు విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు మొట్టమొదటిసారి నీటిని విడుదల చేసి ఆదివారంతో 57ఏళ్లు నిండాయి. 1967 ఆగస్టు 4న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదలచేసి నాగార్జునసాగర్ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. 1955 డిసెంబర్ 10న నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేయగా.. 12సంవత్సరాల అనంతరం ఆయన కుమార్తె ఇందిరాగాంధీ సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. కాల్వల్లో నీరు పారడంతో బీళ్లుగా ఉన్న భూముల్లో రైతులు సిరులు పండిస్తున్నారు. నాడు కటిక దరిద్రాన్ని అనుభవించిన రైతులు నేడు ఆర్థికంగా బలపడ్డారు. తాగు, సాగునీటికి కొదువ లేకుండా పోయింది.

నెరవేరని లక్ష్యం..

ఇనేళ్లు గడిచినా నాగార్జునసాగర్ ప్రాజెక్టు లక్ష్యం నెరవేరలేదు. ప్రాజెక్టుకు కూతవేటు దూరంలో ఉన్న భూములు ఇప్పటికీ బీళ్లుగానే ఉంటున్నాయి. ప్రాజెక్టు నిర్మాణానికి ఆనాటి అంచనా వ్యయం కేవలం రూ.70 కోట్లు కాగా ఆ తర్వాత మరమ్మతులకే వేల కోట్ల రూపాయలు ఖర్చయ్యాయి. అయినప్పటికీ కొన్నిచోట్ల ఆయకట్టుకు నీరందక పోవడంతో ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాజెక్టు ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో రూ.4,444.44కోట్లతో ప్రణాళిక తయారుచేసి పనులను ప్రారంభించారు. సమర్థులైన అధికారులు లేకపోవడం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో 2014 వరకు పూర్తికావాల్సిన పనులు 2016 జూలైలో ముగిశాయి. అన్ని కోట్లు ఖర్చు చేసి ఆధునీకరణ పనులు చేపట్టినా అప్పుడే కాల్వలకు గండ్లు పడటంతో పాటు కాల్వల లైనింగ్ రూపురేఖలు మారాయి. నాణ్యతతో పనులన్నీ పూర్తిచేస్తే మిగిలిన ఆయకట్టు సాగులోకి వచ్చేదని రైతులు అంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మిర్యాలగూడ టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామ శివారులో జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు గ్రామ శివారులో అద్దంకి–నార్కట్‌పల్లి ప్రధాన రహదారి పక్కనే ఓ వ్యక్తి కాళ్లు, చేతులు, తలకు బలమైన గాయాలతో పడి ఉండడం గమనించిన పశువుల కాపరి వెంటనే గ్రామ పంచాయతీ కార్యదర్శి పుల్లారెడ్డికి సమాచారం అందించాడు. కార్యదర్శి వెంటనే మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చూడగా అప్పటికే ఆ వ్యక్తి మృతిచెందాడు. మృతుడు కిష్టాపురం వైపు నడుచుకుంటూ వెళ్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయస్సు 45-50 సంవత్సరాలు ఉంటుందని, గోధుమ రంగు షర్ట్, నలుపు రంగు ప్యాంట్, టవల్ ధరించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి పుల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు మిర్యాలగూడ రూరల్ పోలీసులను సంప్రదించాలని అన్నారు.

పెట్రోల్ బంకుల్లో డబ్బులు కాజేస్తున్న ముఠా అరెస్ట్

- స్వైపింగ్ మిషన్ల ట్రిక్ తెలుసుకుని బురిడీ కొట్టిస్తున్న యువకులు
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్: పెట్రోల్ బంకుల్లో పనిచేసే సిబ్బంది వద్దకు వచ్చి స్వైపింగ్ మిషన్ ద్వారా డబ్బులు కొట్టేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖరరాజు విలేకరులకు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామానికి చెందిన వేముల శ్రీనివాసరావు, నీలటూరి రవి, మాలపాటి శౌరి, నరసరావుపేట మండలం రావిపాడు గ్రామానికి చెందిన అనాల శివ, కారంపుడి మండలం కొమిడిపాడు గ్రామానికి చెందిన కాడితం సిద్దార్థరెడ్డి పెట్రోల్ బంకుల్లో పంపు బాయ్‌లుగా, మేనేజర్లుగా పనిచేసి అక్కడ వినియోగించే స్వైపింగ్ మిషన్లలోని ఆప్షన్లపై పూర్తి అవగాహన పెంచుకున్నారు. స్వైపింగ్ మిషన్‌లోని వీఓఐడీ అనే ఆప్షన్ ద్వారా వినియోగదారుల ఏటీఎం లేదా క్రెడిట్ కార్డుల నుంచి కట్ అయిన డబ్బులను తిరిగి వారి అకౌంట్‌కు పంపవచ్చు అని తెలుసుకున్నారు. ఈ ఆప్షన్ ద్వార పెట్రోల్ బంకుల్లో పనిచేసే అమాయక పంపుబాయ్‌లను మోసం చేసి డబ్బులు సంపాదించాలని వీరందరూ ఒక ముఠాగా ఏర్పడ్డారు. కొన్ని నెలలుగా తెలంగాణ రాష్ట్రంలోని నేరేడుచర్ల, వాడపల్లి, మిర్యాలగూడ పట్టణం, వేముపల్లి, మాడుగులపల్లి, తిప్పర్తి, నల్లగొండ పట్టణంలో పలు పెట్రోల్ బంకుల్లోకి వెళ్లి తమ కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో ఉన్నారని డబ్బులు అత్యవరంగా ఉన్నాయని నమ్మించి తమ వద్ద ఉన్న ఏటీఎం లేదా క్రెడిట్ కార్డులను వారికి ఇచ్చి స్వైపింగ్ చేసి డబ్బులు తీసుకుంటున్నారు. అదే సమయంలో బంకుల్లో పంపుబాయ్‌లను మాటల్లో పెట్టి వారికి తెలియకుండా ఆ స్వైపింగ్ మిషన్ తీసుకుని వీఓఐడీ అనే ఆప్షన్ ద్వారా తిరిగి డబ్బులను వారి ఖాతాల్లోకి పంపుకుని అక్కడి నుంచి ఉడాయిస్తున్నారు. పలు పెట్రోల్ బంక్‌ల నిర్వాహకులు ఇది గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై వేముపల్లి పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఈ ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా నిజం ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.80లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, ఒక క్రెడిట్ కార్డుతో పాటు బైక్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. రూరల్ సీఐ వీరబాబు, వేముపల్లి ఎస్‌ఐ విజయ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ ప్రేమ్‌సింగ్ ఉన్నారు.

తేనెటీగల దాడి.. మహిళ మృతి

తిరుమలగిరి: తేనెటీగలు దాడి చేయడంతో మహిళ మృతి చెందింది. ఈ ఘటన తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో శనివారం జరిగింది. తొండ గ్రామానికి చెందిన పల్లెర్ల యాదమ్మ(48) ఇంటి వద్ద బట్టలు ఉతుకుతుండగా.. ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది.

పెట్రోల్ బంకులో నగదు చోరీ

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి శివారులో గల హెచ్‌పీ పెట్రోల్ బంకులో శుక్రవారం అర్ధరాత్రి ఇద్దరు యువకులు చోరీకి పాల్పడ్డారు. బైక్‌పై వచ్చిన యువకులు బంకులోని కార్యాలయంలోకి ప్రవేశించి అక్కడ నిద్రిస్తున్న బంకులో పనిచేసే వ్యక్తి జేబులోని రూ.45వేలకు పైగా నగదు, సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. ఇది గుర్తించిన బంకు సిబ్బంది ఆ యువకులను అడ్డుకునేందుకు ప్రయత్నించగా తప్పించుకుని పారిపోయారు. పెట్రోల్ బంకులోని సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాల ఆధారంగా వారు తీసుకొచ్చిన బైక్‌ను సైతం చోరీ చేసి తీసుకొనట్లు తెలుస్తోంది. శనివారం బంకులో పనిచేసే సిబ్బంది చిట్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు.



సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలు